


ఎప్పుడొచ్చాడో కానీ కళ్లు తెరిచేసరికీ ఎదురుగా కుర్చీలో కూర్చుని ఏదో పత్రిక తిరగేస్తున్నాడు వాసు.

'ఎంత సేపయింది వచ్చి?' లేచి కూర్చుంటూ అడిగాను.

'ఇప్పుడే! అయినా నాలుగున్నరయింది. ఇంకా నిద్రేమిటి?'

లాస్టవర్ క్లాస్‌లేదు. మూడు గంటలకే రూంకొచ్చా. అలసటగా వుంటే అలా పడుకుని కళ్లు మూసుకున్నా. నాకు తెలియకుండానే నిద్ర పట్టేసింది. స్నానంచేసి వస్తా. అంత వరకూ రేడియో వింటూండు.' టవల్ తీసుకుని లేచాను.

'వస్తూనే రేడియో ట్యూన్ చేసిచూపా. కరెంట్ లేదు కానీ త్వరగా తెములు.'

'ఏమిటి సంగతి? ఏదైనా ప్రోగ్రామా?'

'సినిమా కెళ్దాం పద. మధ్యాహ్నం నుండీ తోచక ఛస్తున్నా' చూస్తున్న పత్రిక మూసి టేబిల్‌మీద పడేస్తూ అన్నాడు వాసు.

'ఇంకా నాలుగున్నరేగా అయింది. అంత తొందరెందుకు?' స్నానానికని లేచావే కానీ బద్ధకం యింకా వదల్లేదు. కాసేపు కూర్చోవాలనుంది.

'బాగా ఆకలేస్తూంది. దార్లో టిఫిన్‌చేసి వెళ్లేసరికి ఎలాగూ టైమవుతుంది కాని నువ్వు త్వరగా తయారవు.'

స్నానానికి వెంటనే వెళ్లక తప్పలేదు.

రూమ్ తాళంవేసి బయలుదేరేసరికి ఐదు గంటలయింది.

సర్వర్ చదివే దండకం వినే ఓపిక, అంతకుమించి టైము లేకపోవడంతో కావలసిన వేవో మేమే ఆర్డరిచ్చాము.

బిల్లు చెల్లించి చిల్లరకోసం చేయిచాస్తే క్యాషియర్ వక్కపొట్లం యిచ్చి 'రెండు పైసలు చిల్లర లేదుసార్, అందుకని...' అంటూ నసిగాడు.

'వ్యాపార లక్షణమే!' అని నవ్వుకుంటూ వచ్చేసాము

*   *   *

థియేటర్ చేరేసరికి ఐదూ పదినిమిషాలయింది. అప్పటికే 'క్యూలో' పదిమంది దాకా వున్నారు. చూస్తుండగానే మా వెనుక 'క్యూ' పెరిగిపోయింది. బుకింగ్ తెరవడానికింకా చాల టైముంది. థియేటర్‌దగ్గర రద్దీ నిదానంగా పెరుగుతూంది.

సినిమా వచ్చి రెండు వారాలయిందేమో. ఆరు గంటలు కాకుండానే చాలరష్‌గా వుంది. ఇంకా మ్యాటనీ వదలినట్లు లేదు. సైకిల్ స్టాండ్‌లో చాల సైకిళ్లు వరుసగా పెరేడ్‌లో సైనికుల్లానుంచునున్నాయి. వాటికిఎదురుగా పది, పన్నెండు స్కూటర్లు, మూడు నాలుగు మోటార్ సైకిళ్లు సైనికాధికారుల్లా దర్పంగా నుంచునున్నాయి. ఒకే ఒక్క కారు వీటన్నింటికీ కాస్త దూరంగా, పోర్టికోలో వందనాలందుకోడానికి వేంచేసిన మంత్రిగారిలా గర్వంగా, ఠీవిగా నుంచునుంది.

గేట్ ప్రక్కనున్న వేరుసెనగకాయల బండిలో కుంపటి ఎర్రగా మండి పోతూంది. అయినా సరే ఆ కుర్రవాడు అలవాటుగా కుంపటిని విసనక్రరతో శక్తికొద్దీ విసురుతూ ఉత్సాహంగా కేకలు వేస్తూ, మధ్య మధ్యన వేరుసెనగ కాయలగురించి రాగయుక్తంగా పాడుతూ అమ్ముతున్నాడు. ఆ సందడికి ఎవరైనా సరే తమకు తెలియకుండానే ఆ వైపోసారి చూస్తారు.

ఆ కుర్రవాడి అంత సందడీ కూడ క్యాంటిన్‌గోల ముందు సూర్యుడు ముందు దివిటీలా వెలవెల బోతూంది. క్యాంటిన్ మహా రద్దీగా, గందరగోళంగా వుంది. వేరుసెనగ కాయలబండీ మీదుగా చూస్తే, కుంపటి లోంచి వచ్చే అతిపలచని పొగమూలంగా క్యాంటీన్ గోడమీది పటంలోని లక్ష్మిదేవి నృత్యం చేస్తున్నట్లుగా వింతగా కదులుతూంది. కౌంటర్‌ముందు పకపక డబ్బులు తీసుకుని అంతకంటే వేగంగా 'కూపన్స్' చించియిస్తున్న ఆ వ్యక్తి అదేదో డబ్బులు తీసుకుని పేపర్లు కత్తిరించి యిస్తున్న యంత్రంలా వున్నాడు.

క్యాంటీన్ పక్కనె వున్న 'అద్దాల కూల్ డ్రింక్ షాప్' అందంగా, సువ్వటగా ఫస్ట్ క్లాస్ భోగి పక్కనే తగిలించిన 'ఫస్ట్ క్లాస్ కంపార్ట్మెంట్'లా వుంది

బుకింగ్ ఆఫీసుకు ఆనుకునివున్న గోడకు ట్యూబ్‌లైట్ వెలుగులో వెలిగిపోతున్న 'స్టిల్ ఫొటోగ్రాఫ్స్'ను విరగబడి చూస్తున్నారు కొందరు.

అక్కడ, ఆ 'క్యూ'లోపదినిమిషాలునుంచునే

సరికే విసుగేసింది. సిగరెట్ తాగాలనిపించింది. వాసును 'క్యూ'లోనే నుంచోమనిచెప్పి నేను పక్కకొచ్చేను. సిగరెట్ కాల్చి నింపాదిగా తిరిగొచ్చేసరికి ఉమ వాసుతో మాట్లాడుతూ కనిపించింది చూస్తూనే ''విష్'' చేసింది.

ఉమ వాసు చెల్లెలు సరోజ క్లాస్‌మేట్! నేను తరచూ వాసు యింటికి వెళ్తుంటాను. కాబట్టి అక్కడ పరిచయమయింది. వాసు దేన్ని గురించో చాల సీరియస్‌గా చెప్తున్నాడు. ఆమె కూడ ఆసక్తిగా వింటూంది. వాడంతే! దేన్నయినాసరే నగిషీలు చెక్కి, ఆసక్తికరంగా చెప్తాడు. ఎదుటి వాళ్లను బాగా ఇంప్రెస్ చేయగలడు.

టైమ్ ఐదున్నరయింది. బుకింగ్ తెరవడానికింకా అరగంట వుంది.

అప్పుడు వేరుసెనగ కాయలబండి పక్కగా నడుస్తూ కనుపించాడు ఓ ముసలివాడు. ఆ పూర్తిగా వంగిపోయిన నడుమును చూస్తే అతన్ని కష్టాలు బలవంతంగా వంచి బ్రతుకు పొడవునా నడుం మీద స్వారీ చేసాయనీ, వయసులో వున్నప్పుడుకూడ వాడు నిటారుగా నడవలేదనీ తెలుస్తుంది. వాడు రోగంచేత, ఆకలిచేత, నీరసంచేత విపరీతంగా వణకిపోతున్నాడు. వానినల్లని చర్మం కండలన్నీ కరగిపోగా ఎముకలను మాత్రం కప్పుతూండటంచేత ఎండుచెట్టు కొమ్మలమీద ఆరేసిన చింకిపాతలావుంది. వాని జుట్టుకు 'మూనె' అనే పదార్థం ఒకటుందని తెలుసుకోడానికైనా ఎప్పుడూ అవకాశం, ఆస్కారం లేకపోవడంతో ట్టలు కట్టుకుపోయింది. వానిముఖం వచ్చీరాని శిల్పి ఉలి ప్రతిదెబ్బకూ చీలిపోయే అతి తక్కువ రకం చెక్కతో చేసినట్లు అస్తవ్యస్తంగా, వంకరటింకరగా వుంది.

వానికళ్లు ఆ గుంటల్లో మునిగిపోవడానికి సిద్ధంగా వున్నట్లున్నాయి. ఆ ముఖం అసహ్యంగా వుంది. నోట్లోంచి కారిన చొంగ బాగా పెరిగిన వాని గడ్డంమీద తీగలు సాగి మరింత అసహ్యంగా వుంది. వాని కడుపు పీక్కుపోయి ఎండిపోయిన చెట్టు తొర్రలా వుంది. వంకరలు తిరిగిపోయిన వూతకర్ర, ఆ కర్రను పట్టుకున్న ఆ చేయీ, రెండు ఎండు కర్రల్ని ఒక దాని చివర్న ఒకటి కట్టినట్లుగా వున్నాయి. వాడికాళ్లు ఆగి ఆగి నడుస్తున్న కాలిపోయిన కట్టెల్లా వున్నాయి.

వాడు తొడుక్కున్న నిక్కరు చివర్లు చినిగి దారాలు వేలాడుతున్నాయి. మరో చేతిలోని లెక్కలేనన్ని నొక్కులూ, చిల్లులూ పడిన ఆ అల్యూమినియం గిన్నె వాడు అడుక్కోడానికీ, అడుక్కున్నదాంతో అంతో యింతో టీ నీళ్లు పోయించుకుని, చిల్లుల్లో సగం పైగా కారిపోగా మిగిలింది తాగడానికీ మినహాయిస్తే చెత్తకుండీలో పారేయ్యడానికి మాత్రమే పనికొస్తుంది.

వాడు 'క్యూ' వైపు నిదానంగా నడుస్తున్నాడు.

వాడు 'క్యూ' చివర్న నిల్చున్న నల్లసూటాయనవద్ద ఆగి అల్యూమినియం గిన్నె ముందుకు చాచాడు. వాడికళ్లు ఆశగా చూస్తున్నాయి. నల్లసూటాయన విసుగ్గా ఓ మారుచూసి తల తిప్పుకున్నాడు. వాడు రెండు క్షణాలాగి ముందుకు కదిలాడు.

---

''మీ అమ్మ నన్ను అవమానపరిచారు. తెలుసా!'' అని కన్నీరుపెట్టింది రామారావు భార్య.

''ఆవిడ ఇక్కడ లేదుగా?'' అని అడిగాడు రా. రా. అయోమయంగా.

''అదే — మీకు ఉత్తరం రాశారు. చివరి వాక్యంలో, 'ఈ ఉత్తరాన్ని అబ్బాయికివ్వటం మరిచిపోకె.' అని రాశారావిడ!'' రామారావు భార్య కన్నీరు మున్నీరయింది...

---

'రాడాన్' కళ్లజోడు వెనకాలి కళ్లు చీత్కారంగా చూసి ముందుకు కదలమన్నాయి.

నోట్ల కట్టతో, చిల్లరతో భారంగావున్న జేబుకల శిల్కులాల్చీ ముసలివాణ్ణి తప్పుకుని అటు కదిలింది.

'రోలెక్స్' వాచీ కట్టుకున్న చేయి వాణ్ణి ముందుకు కదలమని సైగచేసినపుడు సాయంకాలపు నీ రెండలో తళుక్కుమంది.

ముసలివాడు ముందుకు కదిలాడు!

నిగనిగలాడుతున్న కొత్తబూట్ల పక్కనే దుమ్ముకొట్టుకున్న ముసలివానికాళ్లు ఆగాయి. వెంటనే కొత్తబూట్లు శబ్దం చేసుకుంటూ కోపంగా వెళ్లిపోయాయి.

ముసలివాడు నీరసంగా కదిలాడు.

నా వెనక నుంచున్నాయన పక్కనాగింది వంకరకర్ర. వెనకాలివ్యక్తి జేబులోకి చేయి పోనిచ్చాడు. ముసలివాడు ఆశగా చూస్తున్నాడు. ఐదురూపాయల కాగితం, మరో రూపాయనోటూ తీసి 'చిల్లర లేద'న్నాడు.

ముసలివాడు నిరాశగా నావైపు కదిలాడు.

అల్యూమినియం గిన్నె నావైపు మళ్లింది. మౌనంగా అటువైపు తిరిగి నుంచున్నా.

ముసలివాడు నెమ్మదిగా ముందుకు కదిలాడు.

వాసు, ఉమలవద్ద ఓ క్షణంఆగి లాభం లేదని తెలుసుకుని అక్కడేవున్న దంపతుల వైపు వెళ్లాడు. తల్లి చంకలోని కుర్రవాడు ఏదో తింటున్నాడు. ముసలివాడు సమీపిస్తూనే తల్లి అటువైపు తిరిగింది. కుర్రవాడు తింటున్నది కాస్త తుంచి దూరంగా విసిరేసింది దిష్టి దోషం తగలకూడదని.

ముసలివాడు కదలలేక కదిలాడు.

'త్రిబుల్ ఫైవ్' సిగరెట్ ముందు ఆగాడు! సిగరెట్ కన్నెర్రజేసి ముందుకు కదిలింది...!!

ముసలివాడు ముందుకు కదిలాడు. ఆగాడు. వాడు నిరాశగా ముందుకు కదిలాడు. ఆగాడు. కదలలేక ముందుకు కదిలాడు. ఆగాడు. నీరసంగా ముందుకు కదిలాడు.

ముసలివాడు వెనక్కుతిరిగి అడుగులు వేస్తున్నాడు. కాళ్లు భూమిలోకి కూరుకుపోయినట్లు అతినెమ్మదిగా, నడవలేక నడుస్తున్నాడు. ఊతకర్ర రాతికి తగిలి ముందుకు తూలాడు అల్యూమినియం గిన్నె జారిపడింది. అతి ప్రయత్నంమీద కూర్చుని గిన్నెను వణకుతున్న చేతులతో తీసుకున్నాడు కాని లేవలేకపోయాడు. కూర్చునే నిదానంగా జరుక్కుంటూ తన స్థలం చేరి చతికిలబడ్డాడు.

బిక్షగాళ్లు దేశ పురోగమనానికి ఎలా సంకెళ్లు వేస్తున్నారన్నది వాసు చాల చక్కగా వివరిస్తున్నట్లుంది. ఉమ చాల సిన్సియర్‌గా వింటూంది. నాకవన్నీ వినాలనిలేదు. అరవడానికింకా పదినిమిషాలుంది.

అప్పుడు...

రాగాలాపన వినిపించింది సన్నగా. థియేటర్‌లోంచే ననుకున్నాను. కానీ కాదు. ఆలాపన పూర్తయి పాట మొదలయింది. చాలసార్లువిన్నకంఠం వెనక్కుతిరిగి చూసాను.

అతను...అతనే!

అతణ్ణి మునుపు చాలసార్లు థియేటర్ల వద్ద, బస్ స్టాపుల వద్ద చూసాను. రెండు మూడుసార్లు మా కాలేజీలోకూడ చూసాను.

అతను సన్నగా కనిపిస్తున్నా ఆరోగ్యంగా వున్నాడు. కాస్త నలిగిన తెల్లప్యాంట్, చారల చొక్కా వేసుకున్నాడు. చెదరిన జుట్టు, క్షౌ... మాసినగడ్డం తెల్లని ముఖానికి చక్కగా

అమరి మరింత అందంగా కనిపిస్తున్నాడు. ఆ కళ్ళు వింతగా మెరుస్తున్నాయి. పట్టు దలగా చూస్తున్నాయి. పాటకు అనుగుణంగా కదుల్తున్నాయి. హవాయ్ చెప్పులు వేసుకు న్నాడు. అతనికి షేవ్ చేయించి, తలదువ్వించి, సూట్ వేయిస్తే అచ్చంగా సినిమాలో ఆడుతూ, పాడుతూ బాధ్యత తెలియకుండా, అల్లరిగా తిరిగే కథానాయకుడిలా వుంటాడు. అప్పుడు మాత్రం కష్టాల్లో వున్న కథానాయకుడు ఉద్యోగం కోసం వెదుక్కుంటూ పాట పాడుకుంటున్నట్లుగా వున్నాడు. అతనికంఠం అతిమధురంగా లేదు. చాల సామాన్యంగా వుంది అతడు తన్మయుడై పోవటం లేదు. అదేదో తన విధిలా, దినచర్యలా పాడుతున్నాడు.

ఉమ అతణ్ణి చూస్తూనే—

'అరె! వీళ్లమ్మకు కడుపు నొప్పెలా వుందో? ఈయనిక్కడ పాటలు పాడుతున్నాడే!' అంది ఆశ్చర్యంగా.

బలవంతంగా నవ్వాపుకుని 'సంగతేమిట'ని అడిగాను.

'ఉదయం క్లాస్ జరుగుతూంటే అతను మధ్యలో వచ్చి లెక్చరర్ పర్మిషన్ తీసుకుని తనతల్లికి కడుపునొప్పి చాలరోజులుగావుందనీ, ఈ మధ్య బాగా ఎక్కువయిందనీ, హాస్పిటల్లో చేర్పిస్తే ఆపరేషన్ చెయ్యాలన్నారనీ, అందుకు వంద రూపాయలవుతుందనీ, తను పి. యు. సి. పాసయి ఉద్యోగం కోసం చూస్తున్నాడనీ బంధువులూ, మిత్రులూ ఎవ్వరూ తమ నాదుకునే స్థితిలో లేరనీ దీనాతిదీనంగా తనగోడు వెళ్లబుచ్చు

# మ ని షి

కున్నాడు. మేమంతా క్లాసులో సుమారు ఇరవై రూపాయలు వసూలుచేసి యిచ్చాము'

ఉమ చెప్పింది విని విరగబడి నవ్వాడు వాసు. నేను అతి కష్టంమీద నవ్వాపుకున్నాను.

ఉమ చిన్నబుచ్చుకోవడంతో వాసు నవ్వడం ఆపి చెప్పాడు.

'బహుశ యింతకుముందు మీరితన్నిచూసి వుండరు. అందుకే అంత సులభంగా చెప్పిందంతా నమ్మేసారు ఇతను చక్కగా పాడటమే కాక, అంతకంటె చక్కగా నటించ గలడు. ఇదే ఇతని జీవనోపాధి. తల్లికి జ్వరమనో, తండ్రికి పక్షవాతమనో, తమ్మునికి యాక్సిడెంటయిందనో, భార్యప్రసవించిందనో, ఒకోసారి తనే పరీక్ష ఫీజు కట్టాలనీ, ఆ రోజే ఆఖ్రరోజనీ, తను చాల బీదవాడనీ, వూరి నుండి డబ్బులు తెసుకొస్తుంటే ఎవరో డబ్బు కొట్టేసారనీ, బంధువులూ, తెలిసిన వాళ్లెవరూ ఆ వూర్లో లేరనీ, ఫ్రెండ్స్ కొంతవరకూ సహాయం చేసారనీ ఇలా అప్పటి కప్పుడు కట్టుకథలల్లి వాటిని చక్కగా నటించి వీలైనంతవరకూ డబ్బు చేసుకుంటాడు. అప్పుడప్పుడు ఇలా థియేటర్లవద్ద, బస్స్టాపుల వద్ద పాటలుపాడి, డ్యాన్సులుచేసి కొంతవరకూ సంపాదిస్తాడు.

నేనుకూడ మొదటిసారి ఇతణ్ణి చూసినపుడు మీలాగే మోసపోయా.

ఆ రోజు సినిమా థియేటర్ వద్ద కనిపించాడు. ఫస్ట్ షో కనివెళ్లా. జేబులో మూడు రూపాయలు మాత్రం వుంది. అప్పటికే బయటెవరూ జనంలేరు టికెట్ తీసుకోబోతూండగా ఇతనొచ్చాడు. చాల వినయంగా పిలిచి, అంతకంటె దీనంగా 'సార్! నా భార్య ప్రసవించి రెండు రోజు లయింది. రెండు రోజుల్నుండీ బిడ్డ తల్లి పస్తుంది. నేను బియ్యే పాసయ్యాను. బియ్యే చదువుతూండగా యిద్దరం ప్రేమించి పెళ్లి చేసుకున్నాము. మా పెద్దలు, ఆ అమ్మాయి పెద్దలూ కూడ మా పెళ్లికి ఒప్పుకోలేదు. కానీ మేమే స్వతంత్రించి పెళ్లి చేసుకున్నాము. డిగ్రీ చేతికొస్తూనే ఏదో ఒకవుద్యోగం దొరక్క పోదా, నా భార్యను నేను పోషించుకోలేనా అని ఆరోజు ధైర్యంగా ముందడుగేసా! సంవత్సరం నుండి కాళ్లరిగేలా తిరుగుతున్నా కనీసం ప్యూన్ పనయినా దొరకలేదు. అప్పుడప్పుడు దొరికే చిన్నచిన్న కూలిపనులతోనే కాలం గడుపుకొస్తున్నాను. చివరకిలా అడుక్కోవాల్సి వస్తుందని కలలో కూడ అనుకోలేదు' అంటూ తన కథను హృదయ విదారకంగా వివరించి కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. నాకా క్షణం వాళ్ల పెద్దల్ని సరికెయ్యాలన్నంత కోపం వచ్చింది. మనసారా అభినందించాను. ధైర్యం చెప్పాను. సినిమాకు వెళ్లడం మాను కుని ఆ మూడ్రూపాయలూ ఇతనికిచ్చేసి మంచి పనిచేసానన్న తృప్తితో యింటికెళ్లాను.

తర్వాత సెకండ్‌షోకు వెళ్లినప్పుడు ఇతను ఫస్ట్ షో చూసి రిజర్వ్‌డ్ 'క్లాస్' లోంచి బయటకు రావడంచూసి బిత్తరపోయాను. ఆ తర్వాత ఇతని గురించి మా ఫ్రెండ్స్ చాల చెప్పారు. ఇతనిగురించి తెలియనివారెవరైనా సరే ఇతనుచెప్పే విషయాలు తప్పని సరిగా నమ్మాల్సిందే!

ఉమ ఆశ్చర్యంతో అతణ్ణే చూస్తూ వుండిపోయింది.


పాట సాగిపోతూంది. అందరూ ఆసక్తిగా కాకపోయినా మొత్తానికి వింటున్నారు. పాట పూర్తయింది.

అతను నల్లసూటాయన వద్ద ఆగి చేయి చాపాడు. అతని కళ్లు ఆశగా చూడటంలేదు. ఆ చూపుల్లో అభ్యర్థనకంటె 'ఇవ్వకేం చేస్తార'న్న ధీమానే ఎక్కువుంది.

నల్లసూటాయన కళ్లెత్తి పావలా నాణెం చేతిలోవేసి ఒక్క క్షణం ఆగి మళ్లీ పదిపైసలు వేసాడు

అతను వెంటనే ముందుకు కదిలాడు.






### ప్రొటీన్—మీ జుట్టుకు అత్యావసర ఆహారం


మీ అమూల్యమైన జుట్టు నిండా ప్రొటీన్, అది ఆరోగ్యంగా ఉండుటకు దానికి ప్రొటీన్ ఎప్పుడూ అవసరమని నిపుణులు అందరూ అంగీకరించారు. కాని వాతావరణం, గాలి, సూర్యరశ్మి, కృత్రిమ పదార్థాలు—డ్రైయర్లు, బ్లీచ్‌లు, క్షారసంబంధమైన సబ్బులు, చెమట మరియు పులుపు నూనెలు వగైరా, మీ జుట్టులోని ప్రొటీన్‌ను శాశ్వతంగా హరించి, దానిని నిర్జీవంగాను, పొడిగాను తయారు చేస్తున్నాయి. ఒక ప్రొటీన్ పోషణ మాత్రమే మీ జుట్టుకు జీవం, ఆకారం మరియు పెరుగుదలను తిరిగి చేకూర్చగలదు.

### టియారా ఎగ్ షాంపూ మీ జుట్టుకు ప్రొటీన్ ఆహారాన్ని అతి సహజ రూపంలో సమకూర్చగలదు


తాజా గ్రుడ్డుతో శాస్త్రీయంగా తయారు చేయబడి, గ్రుడ్డులోని తెలుపు మరియు అత్యవసరమైన అమినో-ఏసిడ్స్, ఎ & డి విటమిన్లు గలిగి, టియారా ఎగ్ షాంపూలోని గ్రుడ్డు ప్రొటీన్ మీ జుట్టుకు ప్రకృతిచే ఉద్దేశింపబడిన జీవం చేకూర్చే సహజ పోషక పదార్థాలను తిరిగి సమకూర్చగలదు. క్రమబద్ధంగా వాడితే, టియారా ఎగ్ షాంపూలోని ప్రొటీన్ జుట్టు ఊడుట, కొనలు చిట్లుటను అరికట్టుటకు సహాయపడి, సహజమై ఆరోగ్యమైన జుట్టు పెరుగుదలను కల్పించ గలదు—దానికి మెరుపు, అందం ఆకారం, అభివృద్ధి కలిగించగలదు.

### టియారా ఎగ్ షాంపూ మీ జుట్టు పెరుగుదలను మరియు ఆరోగ్యంగా మెరియుట కల్పించగలదు

ప్రొటీన్ సమృద్ధమైన టియారా ఎగ్ షాంపూ మీ జుట్టుకు ఏ ఇతర షాంపూ కన్నా ప్రయోజనకారి. అది మీ జుట్టుకు క్రొత్త జీవం పోసి, దానికి అమిత మెరుపు, మెత్తదనం ఇచ్చి ఎంతో తేలికగా మలచుటకు తోడ్పడుతుంది—ఎంతో అందమైన జుట్టు.



ప్రొటీన్ కొరతగల జుట్టు చివరలు చిట్లుతుంది. తేజోవిహీనంగా, నిర్జీవంగా ఉంటుంది.



ప్రొటీన్ పోషణగల జుట్టు కొనలు చిట్లక, సహజకాంతిని నిలబెట్టుకొని, ఆరోగ్యంగా పెరుగుదలతో ఉండగలదు.

4 సైజులలో దొరుకును.

100 మిలి గాజు బుడ్డి
150 మిలి—పోలి ప్యాక్
200 మిలి గాజు బుడ్డి

ఇంతేగాక క్రొత్త విప్లవాత్మకమైన 70 మిలి విస్పష్టమైన ప్లాస్టిక్ సీసాలో




## టియారా
## ఎగ్ షాంపూ

సమృద్ధియైన ప్రొటీను మీ జుట్టు పెరుగుదలకు, ఆరోగ్యంగా మెరుయుటకు సహకరిస్తుంది

భారతదేశంలో తయారు చేయువారు:
జె. కె. హెలీన్ కర్టిస్ లిమిటెడ్, బొంబాయి-1

ARMS-HC-041-143-TL




# దీక్షాత్రయం

బులుసు వెంకటరమణయ్య

నియమాన్ని అతిక్రమించకుండా ఒక కార్యాన్ని ముగించే వరకూ పట్టుదలతో పని చెయ్యడం సందర్భంలో 'దీక్ష' అనే మాటను ఉపయోగిస్తారు 'ఈ పనిని పూర్తి చేస్తాను' అనే పట్టుదలను 'కంకణం కట్టుకోవడం' అని కూడా అంటారు. వివాహం, ఉపనయనం మొదలగునవి జరిగేటప్పుడు ఆ కార్యాలలో ప్రధానమైనవారు కంకణ ధారణ చెయ్యడం అందరూ ఎరిగినదే! ఈ విధంగా ఏకాగ్రంగా నియమపాలన దీక్ష అనిపించుకుంటున్నది.

కంకణ బంధనం స్వతంత్రించి ఎవరి మట్టుకువారు చేసుకునేది కాదు. గురువు మంత్రపూర్వకంగా దానిని చేయించవలసి ఉంటుంది. గురుని ఆదేశం లేకుండా దీక్ష స్వీకరించడం సాధ్యంకాదు. మంత్రాలు గురుముఖతః ఉపదేశం పొందితేనే గాని ఫలించవని విషయం అందరికీ తెలుసు పాము మంత్రం, తేలు మంత్రం మొదలైనవి దీనికి ఉదాహరణములు.

గురువు దీక్ష ఇవ్వడమంటే ఉపదేశం చెయ్యడం అన్నమాట. ఈ దీక్ష మూడు విధాలు— (1) దృగ్దీక్ష, (2) వాగ్దీక్ష, (3) స్పర్శాదీక్ష.

దృగ్దీక్ష కేవలం చూపునకు సంబంధించి ఉంటుంది గురువు శిష్యుడికి ఉపదేశం చేసి, 'ఈ శిష్యుడు బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందుగాక!' అని మనస్సులోనే దీవిస్తూ ఆ శిష్యుని ఎక్కువ ఆప్యాయంతో చూడడమే దృగ్దీక్ష. చేప గుడ్లు పెడుతుందిగాని, వాటిని పొదగదు. గుడ్లు పెట్టాక వాటిని ఆప్యాయంగా చూస్తుంది. చూచినమాత్రాన కొంతకాలానికి ఆ గుడ్లు పిల్లలవుతాయి. గురుని దృగ్దీక్ష కూడా ఇటువంటిదే!

రెండవదైన వాగ్దీక్ష భ్రమరకీట న్యాయ రీతిని అనుసరించినది తుమ్మెద ఒక పురుగును తీసుకుని వచ్చి, తన గూటిలో ఉంచుతూ, దాని చెవిలో ఎడతెగకుండా ఝుంకారధ్వనులు చేస్తూ, దాన్ని తన వలె మార్చివేస్తుంది ఈ విధంగా పురుగు భ్రమరమై పోతుంది. అట్లే గురువు శిష్యునికి బోధ చేసిచేసి అతనిని తన మాదిరిగా తయారు చేస్తాడు. ఈ ఉపదేశం దీక్షతో కూడింది వాక్కునకు సంబంధించినది కావడంవల్ల ఇది వాగ్దీక్ష అయింది.

మూడవది స్పర్శాదీక్ష ఇది స్పర్శకు సంబంధించినది. పక్షులు గుడ్లు పెట్టిన తర్వాత వాటిని రెక్కలతో కప్పి, కూర్చుంటాయి. ఇదే గుడ్లు పొదగడం అంటారు. కొన్నాళ్ళకు ఆ గుడ్లు పిల్లలవుతాయి. స్పర్శ వల్లనే ఈ పని జరుగుతున్నది. ఆ మాదిరిగానే శిష్యుణ్ణి అనుగ్రహించడానికి గురువు అతనిని తాకుతాడు. గురుని హస్తస్పర్శవల్ల విజ్ఞానం పొంది శిష్యుడు గురువంతటివాడు కాగలడు.

ఈ దీక్షలు బ్రహ్మసాక్షాత్కారానికి ఎంతో అవసరమైనవి.

## మనిషి

కళ్లజోడు వెనకాలి కళ్ళు చిత్రంగా చూసి చిల్లర యిచ్చింతర్వాతే ముందుకు కదలమన్నాయి.

అతను శిల్కు లాల్చీని దాటిం తర్వాత లాల్చీ జేబు చిల్లర భారం కొంత తగ్గినందుకు సంతోషించింది.

'రోలెక్స్' వాచీ పెట్టుకున్నచేయి అర్ధ రూపాయ నాణెం అందించినపుడు వాచీ తళుక్కు మనలేదు కానీ నాణెం తళుక్కుమంది.

అతను ముందుకు కదిలాడు.

నిగనిగలాడుతున్న కొత్త బూట్ల పక్కన హవాయి స్లిప్పర్స్ ఒక్కక్షణమాగి మరింత చిల్లర బరువుతో టకటక కదిలాయి.

అతను ఉత్సాహంగా కదిలాడు.

నా వెనుకనున్నాయన ఐదు రూపాయల కాగితం, రూపాయ కాగితం తీసి ఒక్కక్షణం తటపటాయించి రూపాయ నోటు అందించాడు.

అతను ఆనందంగా నా వైపు కదిలాడు.

అతనిచేయి నా వైపు తిరిగింది. అర్ధ రూపాయ అందించాను

అతను నింపాదిగా ముందుకు కదిలాడు.

వాసు రూపాయ నోటిచ్చాడు. ఉష కొంత చిల్లర యిచ్చింది. అతను దంపతుల వైపు నడిచాడు. తండ్రి కొంత చిల్లర యిచ్చాడు. కుర్రవాడు తినూ ఇస్తూనే మారాం చేసాడు. తల్లి ముచ్చటపడి పిల్లవాడి చేత మరోపావలా యిప్పించింది.

అతను సంతోషంగా కదిలాడు.

'త్రిబుల్ ఫైవ్' సిగరెట్ ముందు ఆగాడు. సిగరెట్ కన్నెర్రచేయలేదు. నవ్వి కొంతచిల్లర యిచ్చింది.

**అతను ముందుకు కదిలాడు. ఆగాడు. ఆనందంగా ముందుకు కదిలాడు. ఆగాడు. సంతోషంగా ముందుకు కదిలాడు. ఆగాడు. ఉత్సాహంగా ముందుకు కదిలాడు. అతని పిడికిలి నిండింది.**

వెనక్కు తిరిగి క్యాంటీన్ వైపు నడుస్తున్నవాడల్లా ముసలివాణ్ణి చూసి ఆగాడు. ఆగి 'ఏం తాతా! ఏమాత్రం ఈ రోజు సంపాదన' అని అడిగాడు.

ముసలివాడు సమాధానం యివ్వకపోయినా ఖాళీ గిన్నె సమాధానం చెప్పింది.

'ఏనాడు సంపాదించావులే, ఈ రోజు ప్రత్యేకంగా అడగడానికి' ఆ కంఠంలో హేళనతో కూడిన సానుభూతి ప్రతిధ్వనించింది.

ముసలివాడు ఏదో గొణుక్కుంటున్నాడు!

అతను గుప్పిలితెరిచి అర్ధరూపాయ నాణెం ముసలివాని అల్యూమినియం గిన్నెలోకి విసిరేసి చకచక క్యాంటీన్‌లోకి వెళ్ళిపోయాడు. నాణెం గిన్నెలోపడి వింత శబ్దం చేసింది. ముసలివాడి కళ్లు కృతజ్ఞతతో మెరిసాయి.

ఆ క్షణం అక్కడున్న అందరిలో కలిగిన సంచలనాన్ని చూడాలని అనిపించినా, 'గిల్టీ'గా ఫీలయి తల ఎత్తలేక ఓరకంట ముసలివాణ్ణి చూసాను. వాడు నా వైపే చూస్తున్నాడు. ఆ చూపులోని హేళన నేను జన్మ జన్మలకు మరచిపోలేను. అది నన్నింకా వెంటాడుతూనే వుంది!